# రివర్స్ గేర్

"అసలే కరువు రోజులు. నలుగురు మగపిల్లలకు పెళ్ళిళ్ళు చేయాలి. మాటలా? ఏం రోజులో ఏమిటో పెద్దాడిని ఎంతో మంది అమ్మాయిలు వచ్చి చూసి వెళుతున్నారు. ఎవరికీ వాడు నచ్చడంలేదు. ఆ కాసేపు వినయంగా వుండి చావరా అంటే వాడు వినడు. ఆ సమయంలోనే పురుషాహంకారం చూపిస్తాడు. అవి వెనుకటి రోజులురా వెధవాయ్, ఈ రోజుల్లో మిమ్మల్ని నలుగుర్ని గుండెల మీద కుంపట్లులా, ఏలా ఒక అమ్మాయి చేతిలో పెట్టి కళ్లు మూసుకోవాలా అని మధనపడుతున్నానని చెప్పినా వినరు. వెధవాయిలు. "పాపం నలుగురు అబ్బాయిల తండ్రి కుటుంబరావు గారి ఆవేదన ఏం చెప్పమంటారు? అబ్బాయిలయితే హాయిగా కట్నం గుంజొచ్చు అనుకుని నలుగుర్ని కన్నారు. కాని పరిస్థితి ఇలా వస్తుందని ఆయన అనుకోలేదు.

అమ్మాయిలు తన అబ్బాయిలను చూడటానికి వస్తూనే వినయంగా వుంటాడా? సిగరెట్టు కాల్చడు కదా, బార్‌కి వెళ్ళనని బాండ్ వ్రాసి ఇస్తాడా? జడ వెయ్యగలడా? వంట చెయ్యగలడా? ఇత్యాది ప్రశ్నలు. అక్కడికీ తల్లి చేత అన్ని పనులు నేర్పించాడు. మగ ముండాకొడుకుల్లాగ గెడ్డాలూ మీసాలు పెంచకండిరా. ఎవరైనా అమ్మాయిలు చూస్తే వీళ్ళకి పొగరు అని పెళ్ళి చేసుకోరు అని చెప్పాడు. అయినా వినరు ఏం చేయాలో ఏమో.

రేపు విశాఖపట్నం నుంచి పెద్దాడిని చూడటానిక్కి ఒక అమ్మాయి వస్తోంది. ఆ అమ్మాయికైనా వీడు నచ్చితే, వీణ్ణి ఒక అమ్మాయి చేతిలో పెడితే ఇంకా ముగ్గురు కుంకలకు పెళ్ళి చేయాలి. ఉన్న ఆస్థి సరిపోతుందో లేదో.

వెనకటికి అమ్మాయిలు పుడితే ఏడిచేవారుట. అలాంటిది ఇప్పుడు అబ్బాయిలు పుడితే ఏడవాల్సి వస్తోంది. ఇదెక్కడి ప్రారబ్దమో.

రేపటి కోసమని, పెద్దాడిని గెడ్డాలూ మీసాలు తీసేసి, మధ్యపాపిడ తీసుకుని, గళ్ళ చొక్కా వేసుకోకుండా, తెల్లని చొక్కా వేసుకోమని, విన

యంగా అమ్మాయి ఎదురుగా కూర్చోమని పెద్దాడికి తగిన జాగ్రత్తలు చెప్పాడు.

ఆ క్షణం రానే వచ్చింది. ఇంటి ముందు కారాగింది. కుటుంబరావు ఎదురు వెళ్ళి, అమ్మాయిని, ఆమెగారి తల్లి తండ్రులను లోపలకు తీసు కొచ్చాడు. కుటుంబరావుగారి నలుగురబ్బాయిలుసిగ్గుతో లోపలికి వెళ్ళిపోయా రు. అమ్మాయి తండ్రి లోపలకువస్తూనే "మీ అబ్బాయిలకు సిగ్గుఎక్కువను కుంటాను. అయినా ఇల్లు చాలా శుభ్రంగా ఉంది. మీ అబ్బాయిలకు చక్క గా ఇంటి పనులు నేర్పారనుకుంటాను. ఈ ముగ్గులు ఎంత బాగున్నాయో ఏ అబ్బాయి పెట్టాడో"

"ఇప్పుడు తమరు చూడబోయే అబ్బాయే ఇల్లు అంతా తీర్చిదిద్దా డండి" కుటుంబరావు వినయంగా అన్నాడు.

"హాయ్ లవ్లీ డాడ్, మన ఇంట్లో ఇంతకన్నా చక్కని ముగ్గులు పెట్టించాలి. అది సరే ముగ్గులతో సరి పెట్టాడా మిగతా ఇంటి పనులు వచ్చునా?" అడిగింది అమ్మాయి.

"వ-వ చ్చునమ్మా ఇపుడుమీరు తినబోయే ఫలహారాలన్నీ అబ్బాయే చేశాడు" అంటూ గడగడ వణుకుతూ చెప్పాడు కుటుంబరావు.

"అదీ చూస్తాం కదా" అందా అమ్మాయి.

ఈలోగా ఫలహారాలు తీసుకొని పెళ్ళికొడుకు కళ వచ్చాడు. అతను సిగ్గుతో చితికి పోతున్నాడు ఆమె అతన్ని తదేకంగా చూస్తోంది.

ఫలహారాలు అందించేక-

"ఇక కూర్చోవచ్చు. మరీ అంత సిగ్గయితే ఎలాగ. నేను పది మందిలో కూర్చున్నప్పుడు కాఫీ టిఫిన్స్ సర్వ్ చేయాల్సివస్తుంది.

"సరే-" అంటూ ఆమెకు ఎదురుగా సోఫాలో వొదిగి వొదిగి కూర్చునాడు కళ. (కళాధర్)

"బై ది బై అంకుల్ మీ అబ్బాయి నచ్చాడు, మీ అబ్బాయిని చేసు కోడానికి షరతులు, కట్నం ఏభై వేలు అది కూడా ముగ్గులు చూసి సగం రిబేట్ ఇచ్చాను. మా తల్లితండ్రులకు చెరి పదివేలు లాంఛనాలు. శోభనం

రోజున నాకు కట్నం ఐదువేలు. ఇక మీకు తెలియనిదేముంది. నాకు తగ్గట్లు మర్యాదలు.

"అమ్మా-నేను అంత ఇచ్చుకోలే-

"దాదీ లేవండి, ఇంతకన్న గొప్ప సంబంధాలు నాకు వస్తున్నాయి. లెటజ్ సీ ఎనదర్ బోయ్" అంటూ లేవబోయింది.

"అమ్మాయి వెళ్ళకమ్మా - మా అబ్బాయిని ఇంతవరకూ ఇరవై మంది అమ్మాయిలు చూశారు. నచ్చలేదని అన్నారు. నువ్వూ వెళ్ళి పోయావంటే వాడి జీవితం బుగ్గి అయిపోతుంది. వాడి తమ్ముళ్ళకి పెళ్ళి ఎలా అవుతుంది?

"నో -" అని కుటుంబరావుగార్ని నెట్టుకొని వెళ్ళింది.

అక్కడే నిలబడి, కళ, అతని తమ్ముళ్లు ఏడుస్తున్నారు.

o o o

"నో-" అంటూ గట్టిగా అరుస్తూ మంచం మీద నుంచి లేచారు కుటుంబరావుగారు.

"నాన్నగారూ" అంటూ కళాధర్ తండ్రి పడకగదిలోకి వచ్చాడు.

"రాజమండ్రికి ఫోన్ చేసి ఆ అమ్మాయిని కట్నం లేకుండా పెళ్ళి చేసుకుంటామని చెప్పు"

"సరే"

అంత వరకు లక్షకు ఒక పైసా కట్నం తగ్గినా ఆ అమ్మాయిని చేసుకోమని చెప్పిన తండ్రిలో, ఇంతటి మార్పు ఎలా వచ్చిందో అర్థంకాక, తనకు నచ్చిన ఆ అమ్మాయితో జీవితం రంగుల కలగా ఊహించుకుంటున్నాడు కళాధర్.

(విజయనగరం 'విజయభావన' వారు ది 28-2-88 న నిర్వహించిన 'కథాకదంబం'లో అధ్యక్షులు కీ॥ శే॥ చా.సో గారి సమక్షంలో చదివిన కథ)

—o—